

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సామాజిక స్పృహ

**ఎదురింట్లో ప్రొద్దుటే** గొడవ. పక్కింటి వాళ్ళ డ్రైనేజీలో వీళ్ళ డ్రైనేజీ కలుపుకుందాం అంటే, వాళ్ళు "మొదట మున్సిపాలిటీ వాళ్ళు వచ్చి డబ్బులు కట్టమన్నప్పుడు మీరు ఒప్పుకోలేదు కాబట్టి మేం ఒప్పుకోం" అన్నారు. వీళ్ళు అక్రమంగా తవ్వి కలిపేసారు. వాళ్ళు రాళ్ళు అడ్డుగా పెట్టి మూసేసారు. వీళ్ళు వాళ్ళ పైపు విరగ్గొట్టేసారు. వాళ్ళు వీళ్ళ ఇంటిమీద కొచ్చి బూతులు తిట్టారు. వీళ్ళూ, ఇంట్లో అద్దెకున్న వాళ్ళూ కలిసి వాళ్ళ ఆడవాళ్ళ జుట్లు పట్టి ఈడ్చారు. వీళ్ళు వాళ్ళ మగాళ్ళ లుంగీలు పట్టి లాక్కొచ్చారు. గొడవ పాకాన పడింది.

నాకు నిద్రాభంగం అయింది. మామూలుగా మా కాలనీలో నేను నిద్రలేచే వేళకి అంతా పనులకి పోతారు. సూది పడితే వినిపించేటంత నిశబ్ధంగా ఉంటుంది. అలాంటిది, ఎదురింట్లో వినోదం. పోలీసులొచ్చారు. మా ఆడబిడ్డ ఎప్పుడూ 'నిమిషం టైం లేదు' అని ఇల్లూ వాకిలీ ఊడ్చుకునే ఆవిడ, నడ్డిన చేతులు పెట్టి (విత్ అవుట్ చీపురు... అసలు కర్ణుడి కవచకుండలంలా అది ఎప్పుడూ ఉంటుంది) బాల్కనీలో నిలబడి పరమానందంగా చూస్తున్నారు.

"ఏవైందండీ?" అన్నాను. నాకు అసలే విసుగ్గా ఉంది. రాత్రంతా ఎక్కడ బాంబులు పెట్టాలీ.. ఎవర్ని రహస్యంగా హత్య చేయించాలీ.. కోడలికి కొత్త కష్టాలు ఏం పెట్టాలీ అని ఆలోచించి ... ఆలోచించి.. అదంతా టీ.వీ సీరియల్‌లో కథ గురించి లెండి. కంగారు పడకండి. బార్క్ రేటింగ్స్ వచ్చాక 80 లక్షల సబ్ రూరల్ కనెక్షన్స్ కలుస్తున్నాయి. వాళ్ళని దృష్టిలో పెట్టుకుని సీరియల్స్ రాయాలి. నేనీ గొడవలో ఉండగా, ఎదురింట్లో గొడవ, మా ఆడబిడ్డ మొహంలో అంత వెలుగు ఈ మధ్యకాలంలో చూడలేదు. రైతు బజారు రేటుకి ఇంటి ముందుకి ఉల్లిపాయలు అమ్మొచ్చినపుడు కూడా! ఎప్పుడెప్పుడు ఏమేం జరిగిందో అంతా వివరంగా పూస గుచ్చినట్లు చెప్పింది. సరిగ్గా మా ఇంటిముందు ఆపాడు పోలీస్ వ్యాన్. ఒక బొజ్జ కానిస్టేబుల్ దిగాడు. వైర్‌లెస్ సెట్‌లో మాట్లాడుత్తున్న డ్రైవర్. ఇద్దరూ యూనిఫార్మ్‌లో ఉన్నారు.

మా ఇంటికి హెచ్.ఎం.టీవి వాళ్ళు వస్తాం అన్నారు ఏదో ప్రోగ్రామ్‌కి. ఈ పోలీస్ వ్యాన్ చూసి వాళ్ళు ఏం కథనాలు రాసుకుంటారో అని నా గుండె దడదడలాడింది.

కానిస్టేబుల్ చక్కని సంస్కృతంలో (లోకల్ లాంగ్వేజ్)లో అక్కడ గుమికూడిన జనాన్ని సంబోధించి తరిమి కొట్టాడు. ఆ తరువాత పిలిచిన పార్టీ చెప్పేది విన్నాడు. ఆయన్ని విననీకుండా ఆ ఇంట్లో అద్దెకుండే ఆవిడ పరిగెత్తుకొచ్చి "వీడు.. ఈ... (చెప్పలేను) నా వీపు మీద చెయ్యి వేసాడు సార్... మర్యాదకల, సంసారం చేసుకునే ఆడదాని వీపుమీద చెయ్యి వేస్తారా? ఇక్కడ.. ఇక్కడ.. "అని కానిస్టేబుల్ వీపు

మీద చరిచి, గుండె మీద తట్టి, కాలర్ పట్టి ఎడాపెడా ఊపేసింది. "రేపో మాపో రిటైర్ అవ్వాల్సిన వయసులో, ఏ హార్ట్ ఎటాకో వచ్చి పోతే ఆ కానిస్టేబులూ? " అని నేను జాలిపడ్డా.

అతను మాత్రం అటూ ఇటూ ఊగిపోయినా నిలదొక్కుకుని 'కామోష్' అని శతృఘ్నసిన్హాలా పెద్దగా అరిచి, లాఠీ తిప్పి "దూరం నిలబడి మాట్లాడు" అన్నాడు.

"ఆడవాళ్ళ ఒంటిమీద చెయ్యి వెయ్యొచ్చా? తాకొచ్చా?" ఆ స్త్రీ మూర్తి ఏడుస్తూ అడిగింది. మరి ఇంతసేపూ ఈవిడ కానిస్టేబుల్ని ఇంతలా ఎందుకు ఊపిందో?

కానిస్టేబుల్ ఇవతల పార్టీ వాళ్ళనీ తన భాషలో అదిలించాడు. అవతల పార్టీ వాళ్ళనీ అదిలించాడు. వారి ఇంట్లోకి దూరి మంతనాలాడాడు. వీరి ఇంట్లోకి దూరి మంతనాలాడాడు.

"ఒక్కసారి ఎఫ్.ఐ.ఆర్ రాసానంటే జిందగీ అంతా లాక్కోవలసిందే. సమజ్ అయిందా?" అని మధ్య మధ్యలో బెదిరించాడు.

నేను కాఫీ కలుపుకుని తాగుతూ, కాళ్ళు లాగుతున్నాయి అని బాల్కనీలో కుర్చీ వేసుకున్నాను. కాసేపయ్యాక అక్కడే 'ఓట్స్' తెచ్చుకుని బ్రేక్‌ఫాస్ట్ కూడా చేసాను. ఈ గొడవ కానిస్టేబుల్ వచ్చినా సద్దుమణగలేదు. అంతకంతకూ తారాస్థాయికి చేరుకుంటోంది.

కానిస్టేబుల్ ఎనర్జీ లెవెల్స్, వచ్చినప్పుడు ఉన్నంతలేవు. నీరసపడ్డాడు.

ఎవరూ టీ చుక్క కూడా పొయ్యలేదు పాపం. "మీరు గవర్నమెంట్‌ని మీ చేతుల్లోకి తీసుకున్నారు. మున్సిపాలిటీ వాళ్ళు టచ్ చెయ్యాల్సిన మోరీని మీరు 'టచ్' చేసారు. ఇందుకు మీ ఇద్దరి మీదా కేస్ అవుతుంది. కానీ ఎఫ్.ఐ.ఆర్ రాయడం లేదు కాబట్టి కాంప్రమైజ్ అవండి" అని తీర్పు చెప్పి, వీళ్ళ డ్రైనేజ్, పక్క వాళ్ళ మేన్‌హోల్‌లో కలిపేసుకొమ్మనీ, అదీ మున్సిపాలిటీ వాళ్ళని పిలిపించే చేసుకోవాలనీ, మీరు అర్ధరాత్రి పూట తవ్వేసుకోవడం కాదు. అనీ సలహా ఇచ్చాడు.

పక్కింటి ఆడవాళ్ళ మీద చెయ్యివేసిన వాడిని 'సారీ' చెప్పమన్నాడు. ఆ అబ్బాయి చెప్పేలోపే, ఎదురింట్లో అద్దెకున్న ఆవిడ మళ్ళీ ఎందరాపినా, ఆగకుండా వీరావేశంతో వచ్చి, సారీ చెప్పబోయిన అబ్బాయి జుట్టు పట్టుకుని వంచి కానిస్టేబుల్ ముందే బడా బడా బాది, 'ఈ దుశ్శాశన... దుర్యోధన...దుర్నీతి లోకంలో..' అన్నట్లు అరచేత్తో ముక్కు తుడుచుకుంటూ విజయశాంతిలా చూసింది.

దెబ్బలు తిన్న కుర్రాడు ఏడుపు. కానిస్టేబుల్ మళ్ళీ సాంస్క్రీట్‌లో, అందర్నీ మందలించాడు. కొద్దిగా డస్సిపోయి ఒక కుర్చీ తెప్పించి మా చెట్టు కింద వేసుకుని కూర్చున్నాడు. కుంపటి వెలిగించేటప్పుడు నిప్పు కొంచెం తగ్గుతుంటే మళ్ళీ విసినికర్రతో విసిరినట్లు, గొడవ తగ్గబోతుంటే ఎవరో ఒకరు మళ్ళీ "ఇందాకా ఈ...గాడు ఏమన్నాడో తెలుసా సార్?" అంటూ మళ్ళీ ఒక తిట్టు. ఎదుటి పార్టీ "వాడేం అన్నాడు ఎరికేనా?" అని మళ్ళీ మొదటి నుండి అందుకోవడం.. ఇలా మధ్యాహ్నం దాకా ఎడతెరిపి లేని ధారావాహిక జరుగుతుండగా, నేను వంటపూర్తి చేసుకుని, ఓ చెవి కిటికీలోంచి అటువేసి, సోఫా కవర్లూ, దివాను కవర్లూ మార్చుకోవడం లాంటి బుర్ర అక్కర్లేని పనులు చేస్తూ తిరిగాను. టీ.విలో వచ్చే నాకు ఇష్టమైన 'ఖానా ఖజానా' కూడా త్యాగం చేసాను. టీ.విలో ఇరవై మూడోసారి 'క్వీన్' సినిమా వస్తుంటే చూడ్డం కూడా త్యాగం చేసాను. ఉమాథర్‌మేన్ 'కిల్‌బిల్' వస్తున్నా పట్టించుకోలేదు. అంటే అంత ఆసక్తిగా ఉందనమాట ఎదురింటి సామాజిక సమస్య.. మరి నేను చూడకపోతే సామాజిక స్పృహ లేనట్టే కదా! అందుకే పాపం.. నాలాగా చాలామంది 'సామాజిక స్పృహతో' గుంపుగా ఆ ఇంటి ముందు మూగారు. చాలా ఇళ్ళల్లోంచి పాలు ఇగిరిపోయి గిన్నె మాడిపోయిన వాసనలూ, పప్పు మాడిపోయిన వాసనలూ కూడా వచ్చాయి. వస్తే వచ్చాయికాక, పిల్లల్ని తయ్యారు చేసి బడికి పంపడం కూడా మానేసారు. మానేస్తే మానేసారు గాక.. ఒక సామాజిక సమస్యని పరిష్కరించడంలో భాగం పంచుకున్నారు.

"అసలు అది ఆడదా? ఏనాడైనా మొగుడికి అన్నం వండి పెడ్తుందా? అసలు అతను ఆఫీస్‌కి వెళ్ళిపోగానే ఎక్కడెక్కడో తిరుగుతుంది" అంది ఒకావిడ.

"నీ సంగతెవడికి తెలీదు? అసలు నువ్వు మొగుడికి మందు పెట్టావుటగా..?" అని  ఆవిడ మొదలు పెట్టింది.

వీళ్ళ పర్సనల్ విషయాలకీ డ్రైనేజ్‌కీ ఏం సంబంధమో తెలీక కానిస్టేబుల్ బుర్ర గోక్కున్నాడు.

వీరి మాటల్లోని దుర్గంధం భరించలేక 'మోరీ' ముక్కు మూసుకుని ప్రవహించడం ప్రారంభించింది. బహుశా అందరి మాలిన్యాన్నీ కొట్టుకుపోయే నేను వీరికన్నా ఎంతో బెటర్ అని భావించి ఉంటుంది ఆ మురికి కాలవ.

ఉట్టప్పుడు చాలా క్లాస్‌గా, డిగ్నిఫైడ్‌గా టాటా సుమోలో తిరుగుతూ, స్కైప్‌లో కూతురు అమెరికా నుండి మాట్లాడ్తుంటే, అందరికీ తెలియాలని గేట్ దగ్గర 'ipad' పట్టుకుని నిలబడే ఎదురింటావిడ, సమస్య రాగానే ముసుగు తీసేసి నగ్నంగా సమస్యని జనం ముందు పెట్టింది.

ఏ 'సామాజిక స్థాయి' మనుషులైనా అంతే.. కాస్త భాషలో ఇంచుమించు ఉంటాయి.

ఇది జరిగాక ఒక ఛానెల్ వాళ్ళు నన్నొక ప్రోగ్రామ్‌కి పిలిచారు. ఆ ప్రోగ్రాం డిజైన్ చూసాకా నాకు 'మురుగు కాలవ' సమస్యకీ దానికీ అట్టే తేడా లేదనిపించింది.

సమాజంలో ప్రముఖులూ, విజ్ఞులూ అయిన ప్రముఖ వ్యక్తులకి, ఒకరొచ్చి తమ ఇంటి సమస్య చెప్పుకుంటారు. దాన్ని వీళ్ళు విని, చర్చించి, ప్రేక్షకుల అభిప్రాయాల్ని అడిగి తెలుసుకుని, అవసరం అయితే లాయర్లనీ, సిద్ధంగా ఉన్న మానసిక శాస్త్రవేత్తలనీ సంప్రదించి ఆ సమస్యని పరిష్కరించే ప్రోగ్రాం. ఒకప్పుడు ఇలాంటిది ఒక తమిళ ఛానెల్‌లో చాలా పాపులర్ అయింది.

పెళ్ళికాని యువకుడు, పెళ్ళయి ఇద్దరు పిల్లలున్న గృహిణితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఆ భర్తా ఇద్దరు పిల్లలతో వేరే వెళ్ళిపోయాడు. ఈ యువకుడితో ఈ స్త్రీ వచ్చేసింది. ఆ యువకుడి తల్లి తండ్రులే వారిని తమ కూతురి ఇంట్లో కొంతకాలం ఉంచారు. కానీ కొడుకుని వేరే పెళ్ళి చేసుకుని వంశోద్ధారకుడ్ని ఇమ్మని బలవంత పెడ్తున్నారు. అతను తెచ్చిన స్త్రీకి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ అయిపోయింది. కానీ ఆ యువకుడు తల్లి తండ్రుల మాట వినలేదు. వాళ్ళు పదకొండు సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నారు. తల్లితండ్రులు ఆమెని వదలక్కర్లేదు, ఆమె ఉండగానే ఇంకో పెళ్ళి చేసుకోమని ఒక ఛానెల్ ద్వారా పబ్లిక్‌గా అతన్ని వత్తిడి చేస్తున్నారు.

ఇది చూసి నాకు మతిపోయింది. (Bigamy)బైగామీ అనేది నేరం. ఇలా అడగచ్చా? పైగా పదకొండు సంవత్సరాలుగా కలిసి ఉంటే అది వివాహం కిందకే వస్తుంది. ఆ స్త్రీకి లీగల్‌గా ఒక భార్య కుండే అన్ని రైట్స్ వస్తాయని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

మధ్యలో ఏంకర్ ప్రేక్షకులకి ఓటింగ్ పాడ్స్ ఇచ్చి 'వీళ్ళు కలిసి ఉండాలంటే 'ఏ' నొక్కండి, విడిపోవాలంటే 'బి' నొక్కండి, 'ఏవీ చెప్పలేని దౌర్భాగ్యం మీదైతే 'సి' నొక్కండి అన్నాడు.

అసలు 'ఏ' 'బి' 'సి' అని నొక్కి వాళ్ళ జీవితాలకి ఈ ప్రేక్షకులు తీర్పునివ్వచ్చా? ఇంక వారి సమస్య చర్చించే నేపథ్యంలో ఇరువర్గాల దూషణ భూషణాలూ, ఏడ్పులూ, సో కాల్డ్ మర్యాదస్తులు మాట్లాడలేని వినలేని విషయాలూ.. ప్రేక్షకులలోంచి లేచి 'అక్రమ సంబంధము పెట్టుకోడానికి సిగ్గులేదూ' అని తిట్టేవాళ్ళు.. ఇదంతా గంటసేపు జరిగాక, ఈ ప్రముఖులు అంతా కలిసి చెప్పే తీర్పుకి ఏ వర్గమూ కట్టుబడలేదు. తిట్టుకుంటూ లేచి చెరో వైపూ పోయారు.

ప్రోగ్రాం ఉద్దేశం మంచిదే ఇలాంటి సమస్యలకి ఆత్మహత్యలు పరిష్కారం కాకుండా, ఇవి నలుగురికీ దృష్టికీ తెచ్చి 'సామాజిక స్పృహ' కలిగించాలని.

ఇది సత్ఫలితాలు ఇవ్వడం ఏమోకానీ, ఇంట్లో చదువుకునే వయసు పిల్లలు చూస్తే వారి ఆలోచనలు ఎలా ఉంటాయో మరి. సమస్యని అర్థం చేసుకోవడం, చర్చించడం, పరిష్కరించడం, మూడు స్టేజ్‌లు.

ఏ మనిషి ఆంతర్యం.. తప్పు చెయ్యడానికి ప్రోద్భలం చేసే బలహీన క్షణాలూ అర్థం చేసుకోడం మానసిక శాస్త్ర వేత్తలకి కూడా ఒక్కోసారి అంతుపట్టదు. అది వారి మనస్తత్వం, పెరిగిన వాతావరణం బట్టి ఉంటుంది.

ఇంక చర్చించడం... అందరూ చెయ్యగలరు. ఎలా చర్చిస్తున్నారు? వినోదం కోసమా, పరిష్కారం కోసమా అన్నది వారి విజ్ఞతని బట్టి ఉంటుంది.

పరిష్కారం.. అది వేరే వారి జీవితాలకి మనం ఇచ్చేట్టయితే... సమస్య కానేకాదది.

మా విషయానికే వద్దాం. ఎదురింట్లో గొడవ అయింది మురుగు కాలవ గురించి. ఎంతమంది సమస్య పరిష్కరించడానికి గుమిగూడారూ? ఎంతమంది వినోదం కోసం చూసారూ? మన ఇంట్లో ఆ సమస్య వస్తే ఏం చేద్దామా అనా? పక్కింట్లో అలాంటి సమస్య వస్తే తీరుద్దామా అనా? లేక అలాంటి సమస్యలు వారికి మాటిమాటికీ వస్తే మనకి టైం పాస్ అనా? అసలు టీ.వీలో సినిమా కూడా వదిలేసి నేను ఎందుకు చూసినట్టూ? ఎండలో నిలబడి స్పృహ తప్పేదాకా చూడ్డం సామాజిక స్పృహా? ఒకవేళ గొడవ సద్దుమణిగిపోతుందేమో అన్న నిరుత్సాహం అందరి మొహాల్లో. ఆ ఎంటర్ టైన్ మెంట్‌ని పెంచడానికి ఇరుగమ్మా పొరుగమ్మా ఒక 'సోషల్ ఇష్యూని' పర్సనల్ కాన్ఫ్లిక్ట్‌గా రూపాంతరం చెందించి తమ వంతు కృషి చేసారు.

అసలు నాకు సామాజిక స్పృహ తక్కువ అని మా కాలనీలో గణేష్ చందా వసూలు చేసి, తొమ్మిది రోజులు లౌడ్ స్పీకర్లు పెట్టి ప్రోగ్రామ్‌లు చేసే కమిటీ నిర్ణయించింది. నేను డబ్బులు ఇస్తాకానీ మీరు లౌడ్ స్పీకర్లు పెట్టకూడదు, చదువుకునే పిల్లలకీ, జబ్బుపడ్డవారికీ, వృద్ధులకీ, నాకూ డిస్టర్బెన్స్ అన్నానని.

నా రచనలు చదివిన విమర్శకులు కొందరు 'అబ్బే.. మిల్స్ అండ్ బూన్ టైప్ రొమేంటిక్ నవలలే కానీ సామాజిక స్పృహ లేదు' అని పెదవి విరిచారు.

రొమేంటిక్‌గా లైఫ్ లీడ్ చెయ్యాలనడం సామాజిక స్పృహ కాదా అని నా డౌట్.

సరే. నా నవలల్లో కళ్ళు లేని చెల్లెలూ, కుంటి తమ్ముడూ, రోగిష్టి అమ్మా, పాపిష్టి నాన్నా.. ఫీజ్ కట్టడానికి డబ్బులు లేకపోవడం.. కట్నం ఇవ్వడానికి డబ్బు లేకపోవడం (అసలు ఇది దురాచారం, నేరం కదా! శ్రీమంతుడులో మహేష్‌బాబు కూడా తన కంపెనీలో పనిచేసే అతని కూతురికి 20 లక్షలు కట్నం స్వయంగా తనే ఎందుకిచ్చాడూ?) కుదరని జబ్బూ, తీరని సమస్యా ఉంటే పోనీ అది సామాజిక స్పృహ ఉన్న రచన అనుకుందాం. అది చదివి జనం మారాలి అనుకోవాలి కానీ, అది చదివి జనం ఏడవాలీ అన్నది నా దృక్పథం కాదు. అందుకే ఒక్కొక్కసారి కాస్త మొట్టికాయ వేసినట్లు చెప్తాను. కొన్నిసార్లు కరక్కాయ రసం తేనెలో రంగరించి, ఉగ్గు గిన్నెతో నాకించినట్లు చెప్తాను. నా కబుర్లలో ఛలోక్తులు అర్ధం అయిన నా పాఠకులకి చురకలు మాత్రం అర్ధం కావూ?

అబ్బో.. నా పాఠకులు బహుతెలివైన వాళ్ళు సుమండీ. ఎంత తెలివైన వాళ్ళంటే.... కామెంట్స్ చదవండి మీకే అర్ధం అవుతుంది.




COMMENTS

